మీ బ్యాంకు.. మీ చేతిలోనే

పెరుగుతున్న మొబైల్ లావాదేవీలు
యావ్‌లతోనే పనులు చక్కబెట్టేయొచ్చు
సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకుల ఉరకలు

ఈనాడు - హైదరాబాద్

లా వాదేవీల నిర్వహణకు ఒకప్పుడు తప్పనిసరిగా బ్యాంకు శాఖకు వెళ్లాల్సి వచ్చేది. తదుపరి ఏటీఎం రూపంలో అతి పెద్ద బ్యాంకింగ్ విప్లవం వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం సృష్టించిన ఈ విప్లవం అంతటితో ఆగలేదు. అక్కడి నుంచి డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్... వరకూ శరవేగంగా సాంకేతిక సేవలు విస్తరించాయి. ఇక ఇప్పుడు మొబైల్ బ్యాంకింగ్ శకం మొదలైంది. ఏవో కొన్ని తప్పించి..., ఇతర పనులకు బ్యాంకు శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అరచేతిలోనే లావాదేవీలు పూర్తిచేసే విధంగా మొబైల్ బ్యాంకింగ్ విస్తరిస్తోంది. 'మొబైల్ యావ్' ఆవిష్కరణ, దానికి దన్నుగా బలమైన సాంకేతిక సామర్థ్యం ఈ సదుపాయాన్ని సుసాధ్యం చేస్తున్నాయి. బిల్లుల చెల్లింపులు, ఖాతాలో బ్యాలెన్స్ ఎంత ఉందో తెలుసుకోవటం, ఇటీవల నిర్వహించిన లావాదేవీల జాబితా (మినీ స్టేట్‌మెంట్), ఆన్‌లైన్ నిధుల బదిలీ... ఇలా ఎన్నో పనులను మొబైల్ యావ్ ద్వారా నిర్వహించే సదుపాయాన్ని బ్యాంకులు ఆవిష్కరిస్తున్నాయి. మన్ముందు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా తెరవటం, రుణ దరఖాస్తులు దాఖలు చేయటం, మొబైల్ కామర్స్... ఇలా అన్ని పనులు మొబైల్ యావ్ ద్వారా నిర్వహించే పరిస్థితి రాబోతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మొబైల్ యావ్ ద్వారా సేవలు అందించటంలో ప్రైవేటు రంగ బ్యాంకులు ముందుండగా, ఎన్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర ప్రభుత్వ రంగ బ్యాంకులు సైతం తామేమీ తీసిపోలేదంటూ మొబైల్ యావ్ ఆధారిత సేవల్లో దూసుకుపోతున్నాయి. ఈ మార్పులు బ్యాంకు ఖాతాదార్లకు ఎంతో వెసులుబాటు కల్పిస్తున్నాయి.

డౌన్‌లోడ్ సులువే

మొబైల్ యావ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవటం ఎంతో సులువు. మీ చేతిలో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ లేదా ఐఫోన్ ఉంటే చాలు. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యావ్ స్టోర్, విండోన్ ఫోన్ యావ్స్, బ్లాక్‌బెర్రీ యావ్ వరల్డ్ వంటి

మొబైల్ యాప్ స్టోర్ నుంచి బ్యాంకింగ్ మొబైల్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రాథమిక వివరాలు అందించిన తర్వాత మొబైల్ ఫోన్‌పై బ్యాంకింగ్ యాప్ సిద్ధమైపోతుంది. ఆ తర్వాత ఇక లావాదేవీలు సాగించటమే. కొన్ని బ్యాంకులు ఒకటి కంటే ఎక్కువ మొబైల్ యాప్‌లు కూడా అందిస్తున్నాయి. ఈ కోవలోకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు... తదితర బ్యాంకులు వస్తాయి.

మనదేశంలో ఇప్పటికే బ్యాంకు ఖాతాదార్లు పెద్దఎత్తున మొబైల్ యాప్స్‌ను వినియోగిస్తూ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి లావాదేవీల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. గత ఏడాది డిసెంబరులో దాదాపు రూ.50,000 కోట్ల మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు జరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్... తదితర బ్యాంకుల ఖాతాదార్లు నిర్వహించే మొబైల్ లావాదేవీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రిటైల్ ఖాతాదార్ల విభాగంతో పాటు, ఎన్ఎంఈ (చిన్న, మధ్యతరహా సంస్థలు) ఖాతాదార్లు సైతం పెద్దసంఖ్యలో మొబైల్ బ్యాంకింగ్ పద్ధతిలో లావాదేవీలు నిర్వహించేందుకు సిద్ధపడటమే దీనికి ప్రధాన కారణమని సంబంధిత అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అంతేగాక స్మార్ట్‌ఫోన్ల వెల్లువ, మొబైల్ నెట్ సామర్థ్యం మెరుగుపడటం కూడా దీనికి దోహదపడుతోంది. బ్యాంకులు మరింత సామర్థ్యముండే యాప్స్ రూపకల్పనపై దృష్టి సారించడమే గాక ఎప్పటికప్పుడు తమ యాప్స్‌ను ఆధునికీకరించేందుకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకు తమకున్న సొంత పరిజ్ఞానంతో పాటు ఇతర ఐటీ సంస్థల సాయాన్ని తీసుకుంటున్నాయి.

గందరగోళమూ ఉంది

ఇక్కడో గందరగోళం కూడా ఉంది. మొబైల్ యాప్‌లు, మొబైల్ వ్యాలెట్‌లు పెద్దఎత్తున బ్యాంకింగ్ వినియోగదార్లకు అందుబాటులోకి రావటం కొంత గందరగోళానికి కూడా తావిస్తున్నట్లు చెబుతున్నారు. పైగా కొన్ని బ్యాంకులు ఒకటి కాకుండా నాలుగైదు మొబైల్ యాప్‌లు అందిస్తున్నాయి. అంతేగాక మొబైల్ ద్వారా అన్ని రకాలైన లావాదేవీలు నిర్వహించగల అవకాశం లేని విషయాన్ని సంబంధిత వర్గాలు కొన్ని ప్రస్తావిస్తున్నాయి. అయితే మొబైల్ యాప్స్ విభాగంలో ఇంకా పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతున్నాయి. 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్'ను ఆవిష్కరించేందుకు ఎన్‌సీపీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కృషి చేస్తోంది. బ్యాంకింగ్ టెక్నాలజీపై పనిచేస్తున్న రిజర్వు బ్యాంకు సారథ్యంలోని ఐడీఆర్‌బీటీ (ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ) కూడా మొబైల్ యాప్స్ విభాగం పై దృష్టి సారిస్తోంది. దీనివల్ల ముమ్ముందు మొబైల్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు విస్తృతమయ్యేందుకే అవకాశం ఉందని అంటున్నారు.

ఐడీఆర్‌బీటీలో బ్యాంకింగ్ అప్లికేషన్స్‌పై పోటీ

మొబైల్ యాప్స్ విభాగంలో బ్యాంకుల మధ్య తొలిసారిగా జాతీయ స్థాయి పోటీని హైదరాబాద్‌లోని ఐడీఆర్‌బీటీ (ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ) నిర్వహించనుంది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నెలకొల్పిన ఈ బ్యాంకింగ్ టెక్నాలజీ పరిశోధనా సంస్థ రేపు హైదరాబాద్‌లో 'ఐడీఆర్‌బీటీ బ్యాంకింగ్ అప్లికేషన్ కంటెస్ట్ (ఐబీఏసీ)- 2016' నిర్వహించటానికి సన్నాహాలు చేస్తోంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో మొబైల్ యాప్స్ వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో... ఈ విభాగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, బ్యాంకుల సన్నద్ధతను పరీక్షించేందుకు ఈ పోటీ ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన తొమ్మిది ఎంట్రీలను ఈ పోటీలో భాగంగా ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. అందులో అత్యుత్తమ

మైన మూడు యావ్‌లను గుర్తించి వాటికి అవార్డులు అందజేస్తారు. ఇటువంటి పోటీని ఐడీఆర్‌బీటీ నిర్వహించటం ఇదే ప్రథమం. ఈ పోటీ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలోని సంస్థలకు ఎంతో ప్రయోజనకారి అవుతుందని సంబంధిత అధికార వర్గాలు భావిస్తున్నాయి.